RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :182 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 17 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 182 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 17 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

### కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అన్ని రంగాల్లో బీఆర్ఎస్ సర్కారు విఫలమైందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం విమర్శించారు. తెలంగాణతో తనకు 2008 నుంచి అనుబంధముందని తెలిపారు. దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం తెలంగాణలోనే

మిగతా 2లో

# బీజేపీని పాతరేద్దాం..!


## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం - కేసీఆర్



ఆదిలాబాద్ - ప్రభాత సూర్యుడు


'కేసీఆర్‌కేం పనిలేదు. 24 గంటల కరెంటిస్తుండు వేస్ట్ అంటున్న కాంగ్రెసోళ్లు చెప్పినట్టు 3 గంటల కరెంటిస్తే పొలం పారుద్దా..? 10 హెచ్‌పీ మోటార్లు యాడదేవాలి. ధరణీ తీసేస్తే భూములాగమైతయి. భూమిపై హక్కు పోతది. వీఆర్ఏలు, రెవెన్యూ వాళ్లు భూమెంతుంది..? ఎంతిస్తరు..? అనే కథ వస్తది. కాంగ్రెసోళ్లు అబద్ధాలు చెప్పే మోసగాళ్లు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. పార్టీల చరిత్ర ఏంటో అభ్యర్థుల గుణమేంటో ఆలోచించి ఓటేయండి. యాభైయేండ్ల కాంగ్రెస్ పాలన లో తెలంగాణెట్లుండే. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ యెట్లుందనేది పరిశీలించండి' అని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్, బోథ్, నిజామాబాద్ రూరల్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో సీఎం మాట్లాడుతూ.. మోడీ సర్కారు తెలంగాణకు ద్రోహం చేసిందని, ఒక్క మెడికల్ కళాశాల, నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదన్నారు. ఇక్కడ నలుగురు బీజేపీ ఎంపీలు ఉండి గడ్డిపీకుతున్నారా అని ప్రశ్నించారు. మతపిచ్చి రేపే బీజీపీని పాతరేయాలని తెలిపారు. ఒక్క ఓటు కూడా బీజేపీకి వేయకూడదని.. వేస్తే

మిగతా 2లో



## రూ.24 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించిన మోడీ

రాంచీ-విజయనేత్ర: గిరిజనుల నాయకులు బిర్సా ముండా జయంతి సందర్భంగా జార?ండ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటించారు. ప్రధానమంత్రి ప్రత్యేక బలహీన గిరిజన సమూహాలు (పిఎం పివిటిజి) మిషన్ కింద సుమారు రూ.24 వేల కోట్ల ప్రాజెక్టులను మోడీ బుధవారం ప్రారంభించారు. ఖుంటి జిల్లాలోని బిర్సా కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు ఎనిమిది కోట్ల మంది లబ్ధిదారులకు పిఎం కిసాన్ పథకం కింద 15వ విడతగా రూ.18 వేల కోట్లను ప్రధాని విడుదల చేశారు. అంతకుముందు రాంచీలోని బిర్సా ముండా మ్యూజియాన్ని మోడీ సందర్శించారు. బిర్సా ముండా జన్మస్థలం ఉలిహాతుకు వెళ్లి, ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, గవర్నర్ సిపి రాధాకృష్ణన్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా తదితరులు ఉన్నారు.




## చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

### -స్కిల్ కేసులో ముగిసిన వాదనలు

అమరావతి-విజయనేత్ర: స్కిల్ డెవలప్‌మెంటు కేసులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది. గురువారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రకటించారు. స్కిల్ డెవలప్‌మెంటు కేంద్రాల ఏర్పాటు వ్యవహారంలో సీమెన్స్ సంస్థ 90 శాతం నిధులను ఖర్చు చేయకముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.330 కోట్లను విడుదల చేసి అవినీతికి తెరతీసిందని సిఐడి తరఫున పొన్నవోలు

మిగతా 2లో



## అధికారంలోకి రాగానే 4 కొత్త పథకాలు

### మంత్రి కేటీఆర్

మొయినాబాద్- ప్రభాత సూర్యుడు: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం గ్యారంటీ అని మంత్రి కేటీఆర్ అన్నారు. పనిచేసే ప్రభుత్వానికి ఎన్నిసార్లయినా అధికారం కట్టబెట్టొచ్చని తెలిపారు. అధికారంలోకి రాగానే నాలుగు కొత్త పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, వికారాబాద్ నియోజకవర్గాల్లో గురువారం మంత్రి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

మిగతా 2లో

## అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు

### కాంగ్రెస్ మ్యానిఫెస్టోను నేడు ఆవిష్కరించనున్న ఖర్గే

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోను శుక్రవారం విడుదల కానుంది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే గాంధీభవన్‌లో శుక్రవారం ఆ ప్రణాళికలను ఆవిష్కరించనున్నారు. అన్ని వర్గాలను ఆకర్షించే విధంగా మ్యానిఫెస్టోను సిద్ధం చేశామని కాంగ్రెస్ చెబుతుంది. ఆరు గ్యారంటీలకు అనుబంధంగా అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా పలు అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినట్టు తెలిసింది. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ అన్ని ప్రజా, కుల సంఘాలు, మత పెద్దలు, అనేక సామాజిక వర్గాలకు చెందిన నాయకులను, ఉద్యోగులు, నిరుద్యోగులను సంప్రదించి ప్రణాళికను రూపకల్పన చేసినట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలివే....**

-ఏకకాలంలో రూ. 2లక్షల పంట రుణమాఫీ

-రూ. 3లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు

- వ్యవసాయానికి 24గంటల నిరంతర ఉచిత విద్యుత్

-ధరణి స్థానంలో భూమాతా

మిగతా 2లో



## న్యాయ కళాశాలల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్

అమరావతి-విజయనేత్ర: రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నేటి నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. లాసెట్-2023లో ఉత్తీర్ణత సాధించినవారికి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్, లాసెట్ కన్వీనరు పి ఉమామహేశ్వరి దేవి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థుల ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 17 నుంచి 20 వరకు ఉంటుందని తెలిపారు. 18 నుంచి 22 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరి అభ్యర్థులకు 21న ఉంటుందని వివరించారు. 23 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని తెలిపారు. 26న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. 28న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని, 29, 30 తేదీల్లో అభ్యర్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని వివరించారు.

## కేసీఆర్‌కు ఓటు హక్కుతోనే... బుద్ధి చెబుదాం..!

### టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



మేడ్చల్- ప్రభాత సూర్యుడు

హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్‌కు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికలు జాతీయ రాజకీయాలను సైతం ప్రభావితం చేస్తాయని తెలిపారు. గురువారం మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద నిర్వహించిన మీటింగ్‌కు రేవంత్ హాజరై మాట్లాడారు. మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తెలంగాణ వచ్చాక దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి మోసం చేశారని గుర్తుచేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, మైనార్టీలకు, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు, కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్య వంటి ఎన్నో హామీలను ఇచ్చి నట్టేట ముంచారన్నారు. ఇప్పుడు ఏకంగా

మిగతా 2లో



## జమ్మూకాశ్మీర్ దోడాలో భూకంపం

దోడా-విజయనేత్ర: జమ్మూకాశ్మీర్ దోడాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 3.9గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) సెంటర్ వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం 9.34 గంటల సమయంలో భూకంపం సంభవించింది. వెడల్పు 33.05, పొడవు 76.18 దోడా ప్రాంతంలో భూకంపం సంభవించింది అని ఎన్‌సిఎస్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు

(మొదటిపేజీ తరువాయి)
లేదా భూభారతి పోర్టల్ ప్రతి రైతుకు భూ ఆధార్‌కార్డు ఇస్తాం.
- ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ సకాలంలో నోటిఫికేషన్లు
- సీపీఎస్ రద్దుపాత పెన్షన్ స్కీమ్ అమలు
- అసంఘటిత కార్మికుల కోసం కార్పొరేషన్
- బీసీలకు 12 కార్పొరేషన్లుతోపాటు వైశ్యులకు సైతం కార్పొరేషన్ .
- ఎంబీసీలకు ప్రత్యేక కార్పొరేషన్
-అభయహస్తం పునరుద్ధరణ
-విద్యార్థులకు ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం
-పోడు భూములకు పట్టాలు
- వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ రూ.6వేలు
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, మెట్రోలో ఉచిత ప్రయాణం, మీడియా కమిషన్ ఏర్పాటు
-ఆరోగ్య శ్రీ పరిమితి రూ 10 లక్షలకు పెంపు దాని పరిధిలోకి మోకాలి సర్జరీ
- ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు కార్డులు
- ప్రయివేటు విద్యాలయాల్లో భోధన, భోధనేతరులకు ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేక జీవో జారీ
-కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ
- గ్రామ పంచాయతీలకు చెరువుల నిర్వహణ, మరమ్మతుల బాధ్యతలు. అందుకోసం తగినన్ని నిధులు
-మెగా డీఎస్సీ ప్రకటించి.. ఆరు నెలల్లో టీచర్ పోస్టుల భర్తీ
-బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయింపు
- మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం
- మూతబడిన దాదాపు 6వేల పాఠశాలలను పున్ణప్రారంభిస్తాం
- కొత్తగా నాలుగు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేస్తాం
- ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి మెరుగైన వైద్యం అందిస్తాం
- భూహక్కుల సమస్యల పరిష్కారానికి ల్యాండ్ కమిషన్ ఏర్పాటు
-సర్పంచ్‌ల ఖాతాల్లో గ్రామ పంచాయతీ అభివద్ధి నిధులు జమ
- గామ పంచాయతీ వార్డు మెంబర్లకు నెలకు రూ.1,500 గౌరవ వేతనం
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ డీఏలు చెల్లిస్తాం
- కొత్త పీఆర్సీ ఏర్పాటు చేసి.. ఆరు నెలల్లో అమలు చేస్తాం
- ఇప్పటికే ఆరు గ్యారంటీలతోపాటు రైతు, మహిళా, మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల హామీ .

## చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)
సుధాకర్‌రెడ్డి వాదించారు. టిడిపి అధికారంలో ఉండగానే ఈ స్కాం వెలుగులోకి వచ్చిందని, ఇందులో చంద్రబాబు పాత్ర ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే స్థాయిలో పలుకుబడి ఆయనకు ఉందన్నారు. ఈ వాదనను చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తోసిపుచ్చారు. చట్టసభలకు ఎన్నికలు జరగబోయే సమయంలో కావాలని ప్రభుత్వం చంద్రబాబుపై కేసులు నమోదు చేసిందన్నారు. ఒక కేసు తర్వాత మరో కేసు నమోదు చేసి చంద్రబాబును ఇబ్బందులకు గురిచేయాలనే కుట్రలో ప్రభుత్వం ఉందన్నారు. 2018 నుంచి స్కిల్ కేసు ఉందని, ఇప్పుడు హడావుడిగా కేసు విచారణ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సీమెన్స్ ఫోరెన్సిక్ ఆడిట్‌ను పూర్తిగా పరిశీలన చేయలేదని రాశారని చెప్పారు. చంద్రబాబును కేసులో ఇరికించేందుకే ఫోరెన్సిక్ రిపోర్టు తయారు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా రిపోర్టు చేసినట్లుగా ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలో ఉందని తెలిపారు. స్కిల్ కేసులో అరెస్టయిన పిటిషనర్ చంద్రబాబు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులు ఉన్నారని, రెండు రోజులపాటు చంద్రబాబును పోలీసుల కస్టడీకి ఎసిబి కోర్టు ఇచ్చిందని, ఆ తర్వాత మళ్లీ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించిందని అన్నారు. రికార్డులన్నీ ప్రభుత్వం వద్దనే ఉన్నాయని, అవి తారుమారయ్యే ఆస్కారం లేదని చెప్పారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో పెడుతున్నట్లు ప్రకటించింది.

## అధికారంలోకి రాగానే 4 కొత్త పథకాలు

(మొదటిపేజీ తరువాయి)
సభల్లో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు ఏమో కానీ ఆరు నెలలకోసారి సీఎం మారడం పక్కా అని ఎద్దేవా చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 111జీఓను రద్దు చేసినట్టు తెలిపారు. 40 ఏండ్ల వికారాబాద్ జిల్లా కలను సాకారం చేశామని, దాంతోపాటు వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేసినట్టు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యేగా కాలే యాదయ్యను, వికారాబాద్ ఎమ్మెల్యేగా మెతుకు ఆనంద్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు కాలే యాదయ్య, మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.

## రూ. 2.86 కోట్ల నగదు పట్టివేత

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో అధికారులు గురువారం రూ.7,95,01,242 విలువ చేసే నగదు, బంగారు, వెండి, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇందులో రూ. 2,86,29,543 నగదు, రూ.2,94,16,524 విలువ చేసే మద్యం పట్టుబడింది.రూ. 59,19,500 విలువ చేసే మత్తు పదార్థాలు, రూ.1,11,24,000 విలువ చేసే బంగారం, వెండి, రూ.44,11,675 విలువ చేసే ఇతర వస్తువులను అధికారులు పట్టుకున్నారు..అక్టోబర్ 9నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ. 577,32,24,246 విలువ చేసే నగదు, బంగారు, వెండి, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర వస్తువులను పట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

# బీజేపీని పాతరేద్దాం..!

(మొదటిపేజీ తరువాయి)
మురికి కాల్వలో వేసినట్లవుతుందని చెప్పారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీకి మెజార్టీ రాదని.. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుం దని జోస్యం చెప్పారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని, ఈ తరుణంలో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణ నాశనం అవుతుందని, ఆ పార్టీకి ఓటు వేసినా మరింత వేస్ట్ అవుతుందని అన్నారు. రైతుల మేలు కోసం మూడేండ్లు కష్టపడి ధరణి పోర్టల్ తీసుకొచ్చి రైతులకే అధికారమిచ్చామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి అధికారం ఉంచుకుంటారా.. పోగొట్టుకుంటారా.. అని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో 50 ఏండ్ల చనాక-కోర్టా బ్యారేజీ కల నెరవేర్చామని, అక్కడ్నుంచి పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు లింక్ కలిపి నీటిని నింపుతామని చెప్పారు. తాను బతికున్నంత వరకు రాష్ట్రం సెక్యులర్‌గానే ఉంటుందని, 75ఏండ్లలో మైనార్టీల కోసం కాంగ్రెస్ కేవలం రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తే తెలంగాణలో ఈ పదేండ్లలోనే రూ.12వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాంలో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ.. త్వరలోనే మంచిప్ప రిజర్వాయర్ పనులు పూర్తిచేసి నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లోని వ్యవసాయానికి ఇజ్రాయిల్ టెక్నాలజీతో ప్రతి మూడు ఎకరాలకు నీటిని అందిస్తామని అన్నారు. మంచిప్ప రిజర్వాయర్లో భూములు కోల్పోయిన బాధితులకు మంచి నష్ట నష్టపరిహారం చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఐటీ రంగంలో దూసుకుపోతున్నామని అన్నారు. త్వరలోనే ఐటీ రంగంలో బెంగుళూరు కంటే మెరుగైన రాష్ట్రంగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టబోయే బ్యూరో పథకాన్ని గల్ఫ్ కుటుంబాలకు కూడా వర్తింపజేసేలా ఆలోచన చేస్తున్నామన్నారు. సంపదను పెంచి.. దాన్ని పేదోడికి పంచాలనే నినాదంతో ముందుకు సాగామని తెలిపారు. ఎవరూ అడగకముందే పెన్షన్ పెంచామని, రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, 24 గంటలు కరెంటు ఇస్తున్నామని, ధాన్యాన్నీ కొనుగోలు చేస్తున్నామన్నారు.

### ఓట్లు రాగానే ఆగమాగం కావొద్దు

ఓట్లు రాగానే ఆగమాగం కావొద్దని, ఆలోచించి ఓట్లేయాలని సీఎం కేసీఆర్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి గెలుపు కోరుతూ నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్, తాగు, సాగునీరు రాలేదని, సంక్షేమమే లేదన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు వద్దంటున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా హల్దీనది నీటితో కళకళలాడుతుందన్నారు. నర్సాపూర్‌లో కొత్త మండలాలు, డివిజన్లు ఏర్పాటు, ఇతర పనులను అధికారంలోకి వచ్చాక తప్పక చేస్తామన్నారు. కాగా, నర్సాపూర్ సభలో పలువురు కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నాయకులు సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నర్సాపూర్ టికెట్ ఆశించిన టీపీసీసీ నాయకులు గాలి అనిల్‌కుమార్, మెదక్ టికెట్ ఆశించిన టీపీసీసీ నాయకులు మేడం బాలకృష్ణ, సంగారెడ్డి బీజేపీ టికెట్ ఆశించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పటాన్‌చెరు టికెట్ ఆశించిన రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ గౌడ్, తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో బుల్లెట్ల కలకలం రేగింది. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ హల్‌చల్ చేశాడు. అతనిపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని పరిశీలించారు. అతని వద్ద రెండు బుల్లెట్లు దొరకడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

# కేసీఆర్‌కు ఓటుహక్కుతోనే బుద్ధి చెబుదాం..!

(మొదటిపేజీ తరువాయి)
మూడోసారి ముఖ్యమంత్రి కావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మంత్రి మల్లారెడ్డికి 30 ఇంజనీరింగ్ కాలేజీలు, మూడు మెడికల్ కాలేజీలు, ఒక యూనివర్సిటీ అనుమతులు ఇచ్చారని, కానీ పేద విద్యార్థులు చదువుకోవడానికి మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదని చెప్పారు. పేద ప్రజలు చదువుకుంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించి హక్కుల కోసం పోరాడతారని, అందుకనే కళాశాలను ఏర్పాటు చేయకుండా పేదల రక్తం తాగేందుకే మల్లారెడ్డి కాలేజీలకు అనుమతులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు దేవేందర్ గౌడ్, మలిపెద్ది సుధీర్ రెడ్డి ఉన్నప్పుడే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులు రేవంత్‌రెడ్డికి క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి బాణసంచా కాల్చి, డప్పు వాయిద్యాలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాద వ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, రమణారెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల బరిలో 2290 మంది..

-పోటీ నుంచి వైదొలిగిన 608 మంది అభ్యర్థులు
-12 స్థానాల్లో ఉపసంహరణల్లేవ్
- 14 చోట్ల 30మందికి పైగా పోటీ
-ఎల్బీనగర్‌లో అత్యధికంగా 48 మంది
- బాన్సువాడ, నారాయణ పేటలో అత్యల్పంగా ఏడుగురు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 2,290 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. . పరిశీలన తర్వాత పోటీలో నిలిచిన 2898 మంది అభ్యర్థులకు గాను 608 మంది పోటీ నుంచి వైదొలిగారు.. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో నామినేషన్ల దాఖలుతో పాటు ఉపసంహరణలు కూడా అత్యధికంగా నమోదయ్యాయి. 114 నామినేషన్లకు గాను 70 మంది ఉపసంహరించుకోగా 44 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. సీఎం పోటీ చేస్తున్న మరో నియోజక వర్గమైన కామారెడ్డిలో 58 మంది అభ్యర్థులకు గాను 19 మంది అభ్యర్థులు పోటీ నుంచి వైదొలగగా 39 మంది పోటీలో నిలిచారు. ఎల్బీనగర్ నియోజక వర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 48 పోటీలో ఉన్నారు. ఇక్కడ 57 మందికిగాను 9 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మల్కాజిగిరి, నాంపల్లి, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, పాలేరు, నల్గొండ, మునుగోడు, ఉప్పల్, శేరిలింగంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో 30 మందికి పైగా పోటీలో ఉన్నారు. బాన్సువాడ, నారాయణ పేటలో అత్యల్పంగా 7 గురు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.. పరిగి, వికారాబాద్, మలక్‌పేట, అంబర్‌పేట, నాంపల్లి, చార్మినార్, బహదూర్‌పూర, నారాయణపేట, గద్వాల, దేవరకొండ, భద్రాచలం, యాకత్‌పుర మొదలగు12 స్థానాల్లో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులెవరు ఉపసంహరించుకోలేదు. ఇక జిల్లాల వారీగా చూస్తే సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం 200 నామినేషన్లు దాఖలు కాగా 105 మంది బరి నుంచి తప్పుకోగా నాలుగు నియోజక వర్గాల్లో 95 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 312 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇక్కడున్న 15 నియోజకవర్గాల్లో మొత్తం 332 నామినేషన్లు దాఖలు కాగా కేవలం 20 మంది మాత్రమే బరి నుంచి వైదొలిగారు.

# తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

(మొదటిపేజీ తరువాయి)
ఉందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం బాగా పెరిగిందన్నారు. ఇది జాతీయ సగటు కన్నా ఎక్కువ ఉందని చెప్పారు. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలూ ఎక్కువగానే ఉన్నాయని చెప్పారు. వ్యాట్ ఎక్కువగా వసూలు చేస్తోందన్నారు. తెలంగాణలో నిరుద్యోగ రేటు 7.8 (పురుషులు), 9.5 (మహిళలు)గా ఉందన్నారు. గ్రామీణ నిరుద్యోగ రేటు జాతీయ సగటు కన్నా తెలంగాణలో అధికంగా ఉందన్నారు. రాష్ట్రంలో 1.91 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 20వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీలో 22 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్టర్ అయ్యారని గుర్తు చేశారు. వారికి నిరుద్యోగ భృతి చెల్లించడంలో సర్కారు విఫలమైందన్నారు. రాష్ట్ర అప్పులు రూ.3.66 లక్షల కోట్లకు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సంక్షేమ పథకాల అమలు కష్టంగా మారిందన్నారు. విద్య, వైద్యానికి కేటాయింపులు దారుణంగా పడిపోయాయని విమర్శించారు. పోషకాహార లోపంతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఒక్క

# మణిపుర్‌లో అస్సాం రైఫిల్స్ పై దాడి ..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మణిపుర్ బలగాలకు తృటిలో ప్రమాదం తప్పింది. భద్రతా బలగాలు ప్రయాణిస్తున్న వాహనం లక్ష్యంగా తీవ్రవాదులు మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సైనిక ఉన్నతాధికారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. “గురువారం ఉదయం పది గంటల ప్రాంతంలో పది మందితో కూడిన అస్సాం రైఫిల్స్ బృందం తెంగ్నౌపాల్ జిల్లాలోని సైబోల్ ప్రాంతం గుండా వెళుతోంది. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న వాహనం లక్ష్యంగా తీవ్రవాదులు మందుపాతర పేల్చారు. భద్రతా బలగాలు ప్రయాణిస్తున్న వాహనం మందుపాతర పేలుళ్లను తట్టుకునేది కావడంతో లోపల ఉన్నవారిలో ఎవరికీ గాయాలు కాలేదు. పేలుడు అనంతరం అస్సాం రైఫిల్స్



వాహనంపైకి తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ప్రతిగా అస్సాం రైఫిల్స్ కూడా కాల్పులు జరపడంతో తీవ్రవాదులు అక్కణ్నుంచి పారిపోయారు” అని తెలిపారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో ప్రత్యేక సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ దాడి కోసం తీవ్రవాదులు తక్కువ తీవ్రత కలిగిన మందుపాతర ఉపయోగించారని సైనికాధికారి తెలిపారు. గత నెలలో మణిపుర్‌లోని మోరే ప్రాంతంలో ఓ పోలీసు అధికారిని తీవ్రవాదులు కాల్చి చంపారు. ఈ ఘటనతో మోరే ప్రాంతంలో అదనంగా 200 మంది అస్సాం రైఫిల్స్ సిబ్బందిని మోహరించారు. మరోవైపు మయన్మార్ నుంచి వచ్చే చొరబాటుదారులను అడ్డుకునేందుకు వీరు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు సైన్యం తెలిపింది. గతవారం మణిపుర్ పోలీసు కమాండోలు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై తీవ్రవాదులు మెరుపుదాడి చేశారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అస్సాం రైఫిల్స్.. సాహసోపేతంగా వారిని కాపాడింది. ఈ దాడిలో ముగ్గురు కమాండోలు గాయపడ్డారు. రెండు వారాల వ్యవధిలో ఇది రెండో దాడి.

## సంపాదకీయం

# స్టాక్ మార్కెట్లో మహాపతన భయం

మరో ఆరు నెలల్లో దేశంలో అతి పెద్ద ఈవెంట్ ఉంది, ప్రజలందరి ప్రయోజనాలతో అది ముడిపడి ఉంది. అదే.. ఏప్రిల్-మే 2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలపై స్టాక్ మార్కెట్‌కు కూడా చాలా ఆసక్తి ఉంటుంది. ఇన్వెస్టర్ల అంచనాలకు అనుగుణంగా ఎన్నికల ఫలితాలు రాకపోతే, మార్కెట్ మీద అతి ప్రతికూల ప్రభావం చూపుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోకపోతే, భారత స్టాక్ మార్కెట్ 30 శాతం వరకు పతనమయ్యే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ లెక్కగట్టింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఎన్నికలు జరగనున్నందున, వ3.7 ట్రిలియన్ల విలువైన భారత స్టాక్ మార్కెట్‌లో మార్పులు వచ్చే అవకాశం ఉందని వాల్‌స్ట్రీట్ బ్యాంక్ చెబుతోంది."కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా. పేరిట ఏర్పడిన ప్రతిపక్ష కూటమిలో కుదిరిన సీట్ల ఒప్పందం సార్వత్రిక ఎన్నికల్లో వేడిని చల్లబరుస్తుంది, మే నెలలో వెల్లడయ్యే ఫలితాల అంచనాలను కూడా తగ్గిస్తుంది" అని, మోర్గాన్ స్టాన్లీ స్ట్రాటెజిస్ట్ ఒక నోట్‌లో రాశారు. ఇన్వెస్టర్ల అంచనాలకు విరుద్ధంగా ఫలితాలు వస్తే మార్కెట్ 30 శాతం మేర జారిపోవచ్చని అంచనా వేశారు.లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వం మారితే, పరిపాలన శైలితో పాటు విధాన సంస్కరణల్లోనూ మార్పు ఉంటుందని, ఇది పెట్టుబడిదార్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తుందని మోర్గాన్ స్టాన్లీ స్ట్రాటెజిస్ట్ నోట్‌లో ఉంది. అయితే, మోర్గాన్ స్టాన్లీ మరో అంచనాను కూడా వెలువరించింది. వచ్చే ఎన్నికల్లో, నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) మెజారిటీ సంపాదిస్తుందని, దీనివల్ల 2024లో బీఎస్‌ఈ సెన్సెక్స్ 14 శాతం పెరుగుతుందని లెక్కవేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రాకపోతే మార్కెట్ మట్టికరిచే అవకాశం ఉందని జెఫరీస్‌కు చెందిన క్రిస్టోఫర్ ఉడ్ కూడా గతంలో అంచనా వేశారు. భారత స్టాక్ మార్కెట్ 25 శాతం కుప్పకూలవచ్చని, అయితే అలాంటి అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయని ఉడ్ చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 16 మే 2014న వెలువడ్డాయి. ఓట్ల లెక్కింపు తర్వాత, నరేంద్ర మోదీ నాయకత్వంలో అత్యధిక మెజారిటీతో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడబోతోందని స్పష్టమైంది. ఆ రోజు, తొలిసారిగా, బీఎస్‌ఈ సెన్సెక్స్ 25,000 స్థాయిని విజయవంతంగా దాటింది, 1450 పాయింట్లకు పైగా ఎగబాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా తొలిసారిగా 7,500 స్థాయిని అధిగమించింది. 2019 లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున, నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రెండోసారి పగ్గాలు చేపడుతుందన్న సూచనలు వెలువడ్డాక, సెన్సెక్స్ తొలిసారిగా 40,000 మార్కును దాటింది. నిఫ్టీ చారిత్రక రికార్డు స్థాయి 12,000 మార్క్‌ను ఓవర్ టేక్ చేసింది. గత చరిత్రకు అనుగుణంగా 2024లోనూ ఇండియన్ స్టాక్స్ పెరగవచ్చని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తున్నప్పటికీ, పెట్టుబడిదారుల అంచనాలకు అందని ఫలితం వస్తే ఇండియన్ ఈక్విటీ బెంచ్‌మార్క్‌లలో 30% పతనం తప్పదని అంటోంది. కార్పొరేట్ ఆదాయాలు, దేశ ఆర్థిక వృద్ధి కలిసి లోకల్ ఒ గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించడంతో, ఈ సంవత్సరంలో (2023) ఇండియన్ స్టాక్స్ 7% పెరిగాయి. ఆసియా మార్కెట్లతోపాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లను దాటి ముందుకు వెళ్లాయి. షేర్ ధరల ఒడిదొడుకుల్లోని రిస్క్‌ను సూచించే ఇండియా విక్స్ , ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 25% పడిపోయి క్షీణించి చారిత్రక కనిష్ట స్థాయికి చేరుకుంది.

# రెంటికి చెడ్డ షర్మిళ



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఆమె ఓ మాజీ ముఖ్యమంత్రి బిడ్డ.. ప్రస్తుత ముఖ్యమంత్రి చెల్లి.. రాజకీయం ఆమెకు వెన్నతో ఎట్టిన ముద్ద. ఇదీ మొన్నటి వరకు షర్మిలపై ఉన్న అభిప్రాయం. కానీ ఇప్పుడు రాజకీయాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదో షర్మిలను చూస్తే అర్థమవుతుందని తెలంగాణ రాజకీయ నేతలు జాలి చూపిస్తున్నారు. కాంగ్రెస్ అడగకపోయినా మద్దతు ప్రకటించి ఎన్నికల బరి నుంచి వైదొలిగారు. ఇందుకు ఆమెకు కనీసం ఆ పార్టీ కృతజ్ఞతలు కూడా చెప్పలేదు. తనను కొన్ని చోట్ల అయినా ప్రచారానికి పిలుస్తారని ఆమె ఆశపడ్డారు. అసలు షర్మిల ప్రస్తావన తీసుకు రావడానికి కూడా కాంగ్రెస్ నేతలు అంగీకరించడం లేదు. ఇంకా చెప్పాలంటే అసలు వైఎస్ ప్రస్తావన వద్దనుకుంటున్నారు. వైఎస్‌పై తెలంగాణలో వ్యతిరేకత ఉందని ఆయన వల్ల కాంగ్రెస్‌కు నష్టమే కానీ.. మేలు ఉండదని అనుకుంటున్నారు. మరోవైపు షర్మిల తీసుకున్న నిర్ణయం బూమరాంగ్ అయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటు కాంగ్రెస్ ఆదరించకపోగా, అటు సొంత పార్టీ లీడర్లు పార్టీని వీడారు. రేవంత్‌రెడ్డి వైఎస్సార్‌ను కీర్తించడానికి అంగీకరించడం లేదు. ఓ జాతీయ టీవీ చానల్ చర్చలో పాల్గొన్నప్పుడు.. వైఎస్‌ను గొప్పగా చెప్పడాన్ని అంగీకరించలేదు. ఆయనొక్కరే కాదని చంద్రబాబు, జైపాల్‌రెడ్డి, పీవీలు కూడా గొప్పేనని స్పష్టం చేశారు. వైఎస్ తెలంగాణను వ్యతిరేకించారని.. అవమానించారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. పైగా షర్మిల తన పాదయాత్రలో ప్రచారం కోసం ఇష్టం వచ్చినట్లుగా అందర్నీ తిట్టారు. ఇది కూడా వివాదాస్పదమయింది. ఇప్పుడు షర్మిల నీడ కాంగ్రెస్‌పై పడితే.. అది తమకే నష్టమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. మద్దతు ప్రకటించినా కనీసం కృతజ్ఞతలు చెప్పడం లేదు. ప్రచారం చేయాలని అడగడం లేదు ఇదిలా ఉంటే.. కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాత్రం షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నిర్ణయం మంచిదని అభినందించారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం మంచి నిర్ణయం అని ఓ టీవీ చానెల్‌లో పేర్కొన్నారు. మిగతా నేతలెవరూ షర్మిల మద్దతుపై స్పందించడం లేదు. దీంతో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించకుండా ఎన్నికలనుంచి వైదొలిగినా షర్మిలకు కాస్త గౌరవం ఉండేదని ఇప్పుడు ఏదీ లేకుండాపోయిందని ఆమె అభిమానులు బాధపడుతున్నారు.

# మౌత్ పబ్లిసిటి భయంలో గులాబీ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** సినిమాల విజయంలో మౌత్ పబ్లిసిటీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అలాగే ఎన్నికలలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే విషయంలో కూడా మౌత్ పబ్లిసిటీ కీలక పాత్ర పోషిస్తుందనీ, గతంలో సంగతి ఎలా ఉన్నాప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మౌత్ పబ్లిసిటీ ప్రాధాన్యత మరింత పెరిగిందనీ పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో దాదాపు మీడియా అంతా ఏకపక్షంగా మారిపోయిన పరిస్థితుల లోమౌత్ పబ్లిసిటీ ప్రజాభిప్రాయం ఎలా ఉందన్న విషయంపై పరిశీలకులే కాదు పార్టీలు కూడా మౌత్ పబ్లిసిటీ మీదే ఆధారపడుతున్నాయి. మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ఇంతగా ప్రతి ఇంటికీ చేరువైన ఈరోజులలో కూడా ఎన్నికలు, ఫలితాలు మౌత్ పబ్లిసిటీ మీద ఆధారపడి ఉండటం ఏమిటి వింతగా ఉందే అనిపించక మానదు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అలాగే ఉందని పరిశీలకులు అంటున్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో ఇప్పటిలా మీడియా పెద్దగా ప్రజలకు చేరువగాని సమయంలో ప్రజా ఉద్యమాల నిర్మాణంలో మౌత్ పబ్లిసిటీదే ప్రధాన పాత్రగా ఉండేది. మహాత్మాగాంధీ సహాయనిరాకరణ, విదేశీవస్తు బహిష్కరణ, దండి సత్యాగ్రహం వంటి ఉద్యమాలకు ఇచ్చిన పిలుపు ఈ మౌత్ పబ్లిసిటీ ద్వారానే జనాలకు చేరిందని చెబుతారు. అప్పట్లో మీడియా పాత్ర పరిమితం. అలాగే అక్షరాస్యత కూడాస్వల్పమే. చదువుకున్న కొద్ది మంది అందుబాటులో ఉన్న వార్తాపత్రికలను చదివి, ఆ విశేషాలను జనాలకు వివరించి చెప్పేవారు. అలా విన్న వారు మరి కొందరికి... విషయం ప్రజలందరికీ చేరేది. ఇందుకుఅప్పట్లో వారం నుంచి పది రోజుల సమయం పట్టేదని ఒక అంచనా. అయితే ఇప్పుడు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా దాదాపుగా అందరికీ అందుబాటులోకి వచ్చేశాయి. అక్షరాస్యులుకూడా గణనీయంగా పెరిగారు. అయితే మీడియాపై విశ్వసనీయత మాత్రం ఏదో ఒక మేరకు సన్నగిల్లింది. అందులో సందేహం లేదు. తెలంగాణ విషయమే తీసుకుంటే.. రాష్ట్రంలో దాదాపు మీడియా అంతా అధికార పార్టీ ప్రచారానికే ఎక్కువ సమయం, స్థలం కేటాయిస్తున్న పరిస్థితి. ప్రధానంగా బీఆర్ఎస్ అధినేత ఇంచుమించు ప్రతి రోజూ మూడు బహిరంగ సభలలో ప్రసంగిస్తుండటంతో ప్రింట్ మీడియాలో కానీ,ఎలక్ట్రానిక్ మీడియాలో కానీ.. ఆయన ప్రసంగానికి సంబంధించిన వార్తే హైలైట్ అవుతోంది. ఇతర పార్టీల ప్రచార కార్యక్రమాలకు కేటాయించే సమయం, స్థలం కూడా తక్కువ అయిపోతోంది. ఈ పరిస్థితుల్లోగ్రౌండ్ రియాలటీపై వాస్తవాలు జనాలకు ఈ మౌత్ పబ్లిసిటీ ద్వారానే తెలుస్తున్నదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక ఎన్నికల వ్యూహకర్తగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే కూడా వివిధరాజకీయ పార్టీల తరఫున ఎన్నికల వ్యూహకర్తగా పని చేసిన సందర్భాలలో మీడియాలో ప్రచారం కంటే మౌత్ పబ్లిసిటీకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు చెబుతారు. మీడియా కంటే మౌత్ పబ్లిసిటీ చాలాబలంగా ప్రజలలోకి వెడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేసేవారు. 2019 ఎన్నికల సమయంలో ఆయన ఏపీలో వైసీపీ తరఫున పని చేసిన సంగతి విదితమే. అప్పట్లో పింక్ డైమండ్ మాయం, వివేకాహత్య, కోడికత్తి దాడి వంటి అంశాలను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో ఆయన మీడియా కంటే మౌత్ టాక్ ద్వారా వచ్చే ప్రచారంపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. అప్పట్లో అదిసత్ఫలితాలను ఇచ్చింది కూడా. ఇక ప్రస్తుతానికి వస్తే తెలంగాణలో వాస్తవ ప్రజాభిప్రాయం అంతా మౌత్ టాక్ ద్వారానే వెలుగులోనికి వస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో సామాజికమాధ్యమం, మౌత్ టాక్ విపక్షాలకు ఒకింత మేలు చేస్తున్నాయనీ, అదే సమయంలో ఎలక్ట్రానిక్ మీడియాలో సింహ బాగం అధికార పార్టీ వార్తల ప్రసారం, ప్రచారానికే పరిమితమైందన్న అభిప్రాయం బలంగాఉందని చెబుతున్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, జనం తరచుగా వెళ్లే బార్బర్ షాపులు, టీ స్టాల్స్, సామాన్యులు ప్రయాణించే సిటీ బస్సులు, మెట్రో రైళ్ల ద్వారా జనాభిప్రాయం ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తూ ఒకబలమైన మాధ్యమంగా మౌత్ టాక్ మారిపోయిందని అంటున్నారు. అత్యధికంగా బీఆర్ఎస్ అవినీతి, పోలవరం ప్రాజెక్టు లోపాలు, మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు వంటి విషయాలపై పెద్దఎత్తున చర్చ జరుగుతున్నదనీ, అంతిమంగా ఈ చర్చ అధికార పార్టీకి వ్యతిరేక అభిప్రాయంగా బలపడుతున్న సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## నంది వనపర్తిలో

# కారు జోరు

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం

### - మాజీ సర్పంచ్ రాజు నాయక్

**-బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు**

**-కిషన్ రెడ్డి గెలుపు ఖాయమని ప్రజలు హామీ ఇస్తున్నారు**



**యాచారం - ప్రభాత సూర్యుడు:** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం జోరుగా జరుగుతుంది. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వాడలో ప్రజలు బిఆర్ఎస్ పార్టీ ప్రచారానికి బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి గుర్తు చేస్తూ ప్రతి కుటుంబానికి ఏదో ఒక విధంగా లబ్ధి పొందినారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, రైతుబంధు, ఆసరా పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్, గ్రామంలో సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలు, అభివృద్ధి జరిగినాయి. ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంచిరెడ్డి కిషన్ రెడ్డిని మరొక్కసారి గెలిపించుకుంటామని ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పంది సుధాకర్, గౌర శేఖర్, కొండాపురం శ్రీశైలం, గోగి కార్ జంగిర్, జెనిగ వెంకటేష్, చందు, ఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు ఎన్నికలకు సహకరించాలి

**మెదక్- ప్రభాతసూర్యుడు :** జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికలకు రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలు- 2023, ఎన్నికల నియమావళిలో బాగంగా గురువారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నిక సంఘం నియమించిన జిల్లా సాధారణ పరిశీలకులు పృథ్వీరాజ్ బీపీ, వ్యయ పరిశీలకులు సంజరు కుమార్, జిల్లా పోలీస్ పరిశీలకులు డిఐజి సంతోష్ కుమార్ తుకారాంలతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలన్నారు. ఈ ఎన్నికలలో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీం లను ఏర్పాటు చేసిందని, తద్వారా ఎంసిఎంసి సెంటర్లో టీవీలు ఏర్పాటుచేసి మోనిటరింగ్ చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యయ పరిశీలకుడు సంజరు కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కొత్త బ్యాంక్ అకౌంట్ తీసుకోవాలని, రూ.10000 కంటే ఎక్కువ బ్యాంక్ నుంచి డ్రా చేసుకోవద్దన్నారు. ఎన్నికల ప్రచార సామాగ్రి రవాణా కోసం అనుమతి పొందాలని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల విలువలు ఈసిఐ ధరల విలువల ప్రకారం వర్తిస్తాయని, ఏదైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, అభ్యర్థి ఖర్చు నమోదు చేయాలన్నారు. జిల్లా పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేల, రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటి చేసే అభ్యర్థుకు సహకరించాలన్నారు. ఎన్నికల్లో పోలీస్ పాత్ర చాలా గొప్పదని, ప్రశాంత




వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవకాశం కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని, రాజకీయ పార్టీలకు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రాజర్షి షా మాట్లాడుతూ.. దాతలు చేసే సహాయ సహకారాలు, ఎన్నికల ప్రచార ఖర్చులు అభ్యర్థి ఖాతాలో జమ అవుతాయన్నారు. ఈ నెల 18న రెండవ రాండమైజేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మెదక్, బీవిఆర్ఐటి ఇంజనీరింగ్ కలశాల నర్సాపూర్ లో ఉంటుందన్నారు. ప్రతి ఓటర్ ఈసీఐ గుర్తించిన 13 గుర్తింపు పొందిన కార్డ్ లలో ఏదో ఒక కార్డ్ తీసుకొని పోలింగ్ కేంద్రానికి రావాలన్నారు. డమ్మీ బ్యాలెట్ తయారుచేసుకునే వారు వారి గుర్తులు మాత్రమే డమ్మీ బ్యాలెట్ లో ఉండాలన్నారు. డమ్మీ బ్యాలెట్ ను తెలుపు, పింక్, ఇతర పార్టీల గుర్తి%శీ%పులతో తయారు చేయరాదని తెలిపారు. పోలింగ్ ఏజెంట్ నియామకంలో జాగ్రత్తలను పాటించలన్నారు. ఏదైనా పిర్యాదులు ఉంటే సి -విజిల్,1950 లో పిర్యాదు చేయవచ్చని, పిర్యాదులు 100 నిముషాల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల యొక్క పూర్తి సమాచారం కోసం కేవైసీ ఆప్ లో తెలుసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ.. ఎవరైనా ప్రచారాన్ని అడ్డుకుంటే పరస్పర ఘర్షణ, పరస్పర పిర్యాదులు ఉంటే 100 ఫోన్ చేయాలన్నారు. టీమ్ లలో పోలిసు అధికారులు ఉంటారని, ప్రచారానికి సంబంధిచిన పిర్యాదులు పరిష్కారిస్తారన్నారు. అభ్యర్థులకు ఏదైనా సందేహాలు ఉంటే సందేహాలు నివృత్తి కోసం పరిశీలకులను సంప్రదించాలని సూచించారు. పృధ్వీ రాజ్ బీపీ ఐఏఎస్, సాధారణ పరిశీలకులు 8969698906, సంజరు కుమార్ వ్యయ, పరిశీలకులు 9177080321, సంతోష్ కుమార్ తుకారాం డీఐజీ పోలీసు పరిశీలకుడు 8125390500 లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు అమిత్‌షా..19న నడ్డా రాక

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా తెలంగాణకు రానున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు అమిత్‌షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఐటీసీ కాకతీయలో ఆయన విశ్రాంతి తీసుకుని 18న ఉదయం 10:30కు హోటల్ కత్రియాలో బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తారు. ఆ తర్వాత సకలజనుల విజయ సంకల్ప సభల్లో(గద్వాల, నల్లగొండ, వరంగల్)లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం సికింద్రాబాద్లోని క్లాసిక గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల రాష్ట్ర నాయకులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. తదనంతరం ఆయన అహ్మదాబాద్‌కు వెళ్లిపోతారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు 19న నారాయణపేట, చేవెళ్ల బహిరంగ సభల్లో, సాయంత్రం మల్కాజిగిరిలో రోడ్‌షోలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీకి వెళ్తారు.

# రాష్ట్రాన్ని అప్పుల కూపంలో ముంచారు

- కెసిఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది
- ఈసారి రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన కొనసాగుతుందని, కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కూపంలో ముంచేసిందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని జన్నారం కాలనీ, అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రం, ఈయన కూడా గ్రామాలలో రోడ్డు షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు అప్పుల పాలు చేసిందని, కెసిఆర్ కుటుంబం ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాల కాలంలో కోట్ల రూపాయలకు పడగలెత్తారని విమర్శించారు. బ్రతుకులు మారుతాయని తెచ్చుకున్న తెలంగాణలో కేవలం కెసిఆర్ కుటుంబం బతుకులు మారాయే తప్ప, పేదల బ్రతుకులు మాత్రం మారలేదని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగానే మిగిలిపోయారని, ధరణి పేరుతో పేదల భూములు లాక్కుని రైతుల బ్రతుకులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉద్యోగాలు రావాలన్న, పేదల, రైతుల బ్రతుకులు మారాలన్న కెసిఆర్ ప్రభుత్వాన్ని అంతమొందించాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్ గౌడ్, జడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్, ఇనాంగూడ సర్పంచ్ అంతటి యశోద ఉషయ్య గౌడ్, ఎంపీటీసీ తాటిపల్లి సౌమ్య రమేష్ గౌడ్, కేశెట్టి వెంకటేష్, కో ఆప్షన్ మెంబర్ గౌస్ పాషా, ఉపసర్పంచ్ చెరుకు కావ్య శివశంకర్ గౌడ్, నాయకులు పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, అబ్దుల్లాపూర్ పేట్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ గౌడ్, బి బ్లాక్ అధ్యక్షుడు సిహెచ్ భాస్కర చారి, అంతటి రవీందర్ గౌడ్, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా అభివృద్ధికి పాటుపడే బిఆర్ఎస్ నే గెలిపించాలి

- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- అసైన్మెంట్ భూములు కోల్పోయిన వారికి న్యాయం జరుగుతుంది
- తాటికుంట ఆలయ అభివృద్ధికి సహకరిస్తా



యాచారంబీ- ప్రభాత సూర్యుడు

యాచారం మండలంలోని కుర్మిద్ధ, తాడిపర్తి, నానక్ నగర్, నక్కర్త మేడిపల్లి గ్రామాలలో రోడ్ షో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డి రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ పాల్గొన్నారు. గ్రామాల చౌరస్తాలలో ప్రభుత్వం చేసినటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.కారు గుర్తుకే ఓటేయాలని మరొక్కసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మాసిటీలో పట్టా భూములు ఎవ్వరూ కొల్పోరని స్పష్టం చేశారు, ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ వాళ్లు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చెయ్యొద్దని, నిజా నిజాలు త్వరలోనే తెలుస్తుందని. అసైన్డ్ భూములు కోల్పయిన వారందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. తాటిపర్తి గ్రామంలో యువకులకు క్రీడా మైదానం కోసం 1.20 ఎకరా భూమిని కూడా ఇస్తానని హామీ ఇచ్చారు. గాండ్లగూడ నుంచి మేడిపల్లి వరకు కోటి రూపాయల డబుల్ రోడ్డు వేస్తానని తెలిపారు.

తాడిపర్తి గ్రామ సీనియర్ నాయకురాలు, మాజీ ఉపసర్పచ్ ముప్పిడి బుగ్గమ్మ ,దండెం రామ్ రెడ్డి అనుచరులు బిఆర్ఎస్ పార్టీ మంచిరెడ్డి సమక్షంలో చేరారు. తాటికుంట మైసమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తానని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య , బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మాజీ జెడ్పిటిసి కందుకూరు రామచంద్రయ్య బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్, పాచ్య భాష, శ్రీనివాస్ రెడ్డి, ఆడాల గణేష్ ,మక్కపల్లి స్వరూప,రవి కిరణ్, పంది శేఖర్, సంఘం రాజు, మద్దెల శశికళ, మల్లేష్, దంతుక జంగయ్య, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువ ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రాజర్షిషా



మెదక్- ప్రభాత సూర్యుడు

యువ ఓటర్లు నూతన ఉత్సాహంతో ఓటింగ్‌లో పాల్గొనాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్, వ్య య పరిశీలకుడు సంజయ్ కుమార్, పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం, జిల్లా ఎన్నికల అధికారి, క లెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం 100 శాతం పోలింగ్ లక్ష్యంగా యువ ఓటర్లను ఆకర్షించడానికి సెల్ఫీ పాయింట్లను ఆవిష్కరించారు. అనంతరం యువ ఓ టర్లు, మహిళలు, ఉద్యోగులచే ఓటరు ప్రతిజ్ఞా చేయించారు. ఎన్నికలకు సంబంధించిన ఓటర్ నమోదు, ఎథిక్ ఓటింగ్, సి -విజిల్, టోల్ ఫ్రీ నెం1950 వంటి వాటి పై రంగోలి పోటీలు నిర్వహణ ఏర్పాటు చేశా రు. పోటీలో వివిధ శాఖలకు చెం దిన 50 టీమ్ లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ ఎన్నికలలో భాగంగా స్వీప్ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో 100 శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రచారం చేస్తుందని తెలిపారు. నేను కచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ప్రజలు ఓటింగ్ లో భాగస్వామ్యం కావాలని పిలపునిచ్చారు. అనంతరం నిర్వహించిన రంగోలిలో మూడింటికి ఉత్తమమైనదిగా ఎంపిక చేశారు. మెదక్ నగర పంచాయతీ మొదటి బహుమతి, రెండువ, మూడవ బహుమతులు డిసిపియు, మెదక్ చైల్డ్ లైన్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎన్నిక అధికారి, అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మ శ్రీ, జిల్లా సంక్షేమ అధికారి బ్రాహ్మజి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి విజయలక్ష్మి, డీసీఏ కరుణ, ఏవో యునస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి అభివృద్ధిలో పాలుపంచుకుంటా

## కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేఅభ్యర్థి డాక్టర్ మురళి నాయక్



**నెల్లికుదురు- ప్రభాత సూర్యుడు:** మీరు నన్ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించండి మీ అభివృద్ధిలో పాలు పంచుకుంటా అని కాంగ్రెస్ పార్టీ మహబూబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళి నాయక్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి దుర్గ భవాని తండా వస్రంతండా రావిరాల మదనతుర్థి గ్రామాలలో గురువారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏదేళ్ల యాదవ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు బాలాజీ నాయక్ జిల్లా కార్యదర్శి చిన్నలక్ష్మారెడ్డి మాజీ జెడ్పిటిసి హెచ్ వెంకటేశ్వర లతో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే వెంటనే అమలు పరుస్తుందని అన్నారు కానీ కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచి కల్లబొల్లి మాటలు చెప్పుకుంటూ కాలయాపన చేశాడు. తప్ప ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడంలో విఫలం చెందాలని అన్నారు. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారు. తప్ప ఏ ఒక్కరి కూడా న్యాయం చేయలేదని అన్నారు మహబూబాద్ ఎమ్మెల్యే తన స్వార్ధ రాజకీయం చేసుకుంటూ కోట్లాది రూపాయలను దోచుకున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తుందని అన్నారు గతంలో ఉచిత విద్యుత్తు రైతు రుణమాఫీ చేసింది కూడా కాంగ్రెస్ పార్టీ అని అన్నారు బీఆర్ఎస్ బీజేపీ మాటలు నమ్మవద్దని అన్నారు. గమంలో బీజేపీ బీఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండవల కప్పి స్వాగతించారు. బీజేపీ భూత్ అధ్యక్షుడు తాళ్ల అశోక్ ఆ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు కడారి నాగయ్య నాలం రాజు మార్కం మల్లయ్య కడారి వెంకటాద్రి కత్తుల నాగయ్య తో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు డాక్టర్ మురళి నాయక్ ఆధ్వర్యంలో చీరలు తెలిపారు. ఈ బీజేపీ బీఆర్ఎస్ కార్యక్రమంలోవైస్ఎంపీపీ జెల్ల వెంకటేష్,జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుఎదల్లయాదవ రెడ్డి, నాయని సత్యపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి హేచ్ వేంకటేశ్, సీపీఐ జల్లా నాయకులు అజయ్ సారధి,.మండల నాయకులు ఓరి పెల్లి వెంకన్న,.గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల మురళి, పేరుమండ్ల మల్లేశం మట్ట యాకుబ్ రెడ్డి, బండపల్లి కృష్ణ కత్తుల వెంకన్న కత్తుల కృష్ణ రేఖ అశోక్ రాస వెంకటరెడ్డి కత్తుల యాకన్న కత్తుల రాము, పట్నం శెట్టి నాగరాజు,.నెలకుర్తి వెంకటరెడ్డి,పొనుగోటి రామారావు, వలబోజు వెంకటేశ్వర్లు కొప్పు శ్రీనివాస్, నేలకుర్తి చెన్న బోయన శ్రీనివాస్ గుగులోతు రమేష్ గుగులోతు రాము తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215